# సాక్షి
## రాజన్న సిరిసిల్ల

సోమవారం । 10 । మార్చి । 2025




### మంత్రి, ప్రభుత్వ విప్‌లను కలిసిన ఎస్పీ

వేములవాడ: రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లను ఎస్పీ గీతే మహేశ్ బాబాసాహెబ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వేములవాడలో నిర్మించిన గౌడసంఘం భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో హాజరయ్యేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం వేములవాడకు చేరుకున్నారు. స్థానిక ఆలయ గెస్ట్‌హౌస్‌లో రాత్రి బసచేశారు. ఈ సందర్భంగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ మంత్రి, ప్రభుత్వ విప్‌లను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క బహూకరించారు.






| | ఇఫ్తార్ సోమవారం (సా॥) | సహర్ మంగళవారం (ఉ॥) |
|---|---|---|
| కరీంనగర్ : | 6.27 | 5.07 |
| పెద్దపల్లి : | 6.30 | 5.06 |
| సిరిసిల్ల : | 6.25 | 5.16 |
| జగిత్యాల : | 6.30 | 5.09 |

## న్యూస్‌రీల్

### సేవాగుణం ఉండాలి



మాట్లాడుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): ఎంత సంపాదించినా కొంత సమాజానికి దానం చేయాలనే సేవా గుణం ఉండాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలో ఆదివారం కరీంనగర్ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్ అందజేసిన సందర్భంగా మాట్లాడారు. కరీంనగర్ అలయన్స్ క్లబ్ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్ వాసుదేవ, ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ, ఇల్లంతకుంట అలయన్స్ క్లబ్ చైర్మన్ ఆనంద్‌శర్మ, కూనబోయిన బాలరాజు, డాక్టర్ మహేశ్, బండారి నర్సయ్య, కాసుపాక శంకర్, అంతగిరి వినయ్‌కుమార్, మామిడి రాజు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి కరాటేలో స్వర్ణ పతకాలు



కరాటేలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

కోనరావుపేట(వేములవాడ): జాతీయస్థాయి ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్‌లో మండలానికి బాలికలు స్వర్ణ పతకాలు సాధించారు. పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన మొదటి జాతీయస్థాయి ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మండలంలోని కనగర్తి, బావుసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. టీమ్ కటాలో కనగర్తికి చెందిన పల్లవి, శరణ్య, రుచిత, వైష్ణవి, రేష్మ, నిత్య, రచన, నక్షత్ర, వర్ష స్వర్ణ పతకాలు సాధించారు. వ్యక్తిగత కటాలో బావుసాయిపేటకు చెందిన గంగాదేవి, హర్షిని బంగారు పథకాలు సాధించారు. వీరిని కరాటే ఇన్‌స్ట్రక్టర్ మంగళగిరి శ్రీనివాస్, హెచ్‌ఎం వినోద్‌కుమార్, చంద్రశేఖర్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ భూమిరెడ్డి అభినందించారు.

### డప్పుల దరువుతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఆదివారం దప్పుల దరువు నిర్వహించారు. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్‌మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణచట్టం చేసే వరకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలను విడుదల చేయొద్దని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండా థామస్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గుంద్రెడ్డి రాజు, జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, జిల్లాకో-కన్వీనర్స్ సావనపెల్లి రాకేశ్, నేరెళ్ల శ్రీనివాస్, దండోరా కళామండలి జిల్లా ఉపాధ్యక్షుడు పసుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

### దళితుల్లో వైషమ్యాలు పెంచొద్దు

- మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాములు



మాట్లాడుతున్న రాగుల రాములు

సిరిసిల్లటౌన్: ఐక్యంగా ఉన్న దళితుల మధ్య బీఆర్‌ఎస్ వైషమ్యాలు పెంచుతోందని మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్ నేతలపై మాట్లాడుతున్న ఓ దళితనేత గతంలో దళితులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసులు పెట్టినా ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. బీఆర్‌ఎస్ ఉచ్చులో దళితులు పడి తమ సామాజికవర్గంలో వైషమ్యాలు రాకుండా చూసుకోవాల్సి ఉందన్నారు. గొట్టె లింబాద్రి, కొంపెల్లి విజయ్, వంకాయల భూమయ్య పాల్గొన్నారు.



ఇది సిరిసిల్ల మొదటి బైపాస్‌రోడ్డులో నర్సింగ్ కాలేజీ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం. రాజీవ్‌నగర్‌కు చెందిన నేతకార్మిక కుటుంబానికి చెందిన దంపతులు గుడ్ల కౌసల్య(51), గుడ్ల రాజు(55) సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళ్తుండగా.. లారీ వచ్చి ఢీకొట్టింది. పట్టణం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బైపాస్‌రోడ్డుపై వాహనాలు వేగంగా వెళ్తుండడం, కలెక్టరేట్‌లోకి వెళ్లాలంటే రగుడు చౌరస్తా దాటాలి. అయితే ఈ చౌరస్తా ప్రమాదకరంగా ఉంది. నాలుగు వైపులా నుంచి వాహనాలు వస్తుండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.



ఇది సిరిసిల్లలోని బీవైనగర్ షాదీఖానా పక్కన ఉన్న చేనేత, జౌళిశాఖ ఆఫీస్. నేతన్నలకు త్రిఫ్ట్ పొదుపు పథకంలో సమస్యలు, బీమా పథకాలు, 10 శాతం యారన్ సబ్సిడీ కోసం ఆఫీస్‌కు వెళ్లి తెలుసుకునే వారు. ఈ ఆఫీస్ భవనానికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి. కానీ ఇటీవల ఇక్కడి నుంచి కలెక్టరేట్‌కు తరలించారు. ఇప్పుడు ఏ పనికోసమైనా నేతకార్మికులు, వస్త్రోత్పత్తిదారులు, ఆసాములు నాలుగు కిలోమీటర్ల దూరంలోని రగుడు వద్ద గల కలెక్టరేట్‌కు వెళ్లాల్సిందే.

# కలెక్టరేట్‌లో చేనేత..
# వేములవాడలో యారన్!

- అవసరం ఓ చోట.. ఏర్పాట్లు మరోచోట
- కార్మికక్షేత్రానికి దూరభారం
- సిరిసిల్లకు దూరంగా ఏర్పాట్లు
- అయోమయంలో కార్మికులు, ఆసాములు





ఇది కలెక్టరేట్ మొదటి అంతస్తులోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్. ఈ ఆఫీస్‌కు బోర్డు కూడా లేదు. ఇక్కడికి సిరిసిల్ల నేతన్నలు రావాలంటే.. సొంత బండి ఉన్న వారు నేరుగా వస్తారు. ఏ వాహనం లేని పేద నేతకార్మికులు, ఆసాములు ప్రత్యేకంగా ఆటో కిరాయి రూ.100 చెల్లించి రావాలి. రాను, పోను ఆటో కిరాయి రూ.200 అవుతుంది. అంత దూరం నుంచి వస్తే.. అధికారులు ఉంటరో.. ఉండరో కూడా తెలియదు. సిరిసిల్లలోనే అనువుగా ఉండే జౌళిశాఖ ఆఫీస్‌ను కలెక్టరేట్‌కు మార్చడం స్థానికంగా చర్చనీయమైంది.



ఇది వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులోని యారన్ డిపో. సిరిసిల్ల నేతన్నలు ఉత్పత్తి చేసే ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధించిన నూలును ఈ డిపో ద్వారా అరువుపై ఇస్తారు. వస్త్రపరిశ్రమ మొత్తం సిరిసిల్లలో ఉంటే.. యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేశారు. వస్త్రోత్పత్తిదారులు సిరిసిల్ల నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని వేములవాడ గోదాంకు వెళ్లి వారికి అవసరమైన నూలును అరువుపై తెచ్చుకుని బట్టను నేయాల్సిన దుస్థితి.

సిరిసిల్ల: అభివృద్ధి చెందినాకొద్దీ వసతులు దరిచేరాలి. అప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయి. కానీ సిరిసిల్లలో వింత పరిస్థితులు ఉన్నాయి. సౌకర్యాలు చెంతకు రావాల్సింది పోయి దూరమవుతున్నాయి. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు అవసరమైన యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేయగా, ఇటీవల జిల్లా కేంద్రంలో ఉన్న చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో కార్మికులు, ఆసాములకు దూరభారంగా మారింది.

**26 వేల మరమగ్గాలు.. 10 వేల మంది కార్మికులు**

సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో 26వేల మరమగ్గాలు, 10వేల మంది కార్మికులు, మరో 5వేల మంది అనుబంధ రంగాల కార్మికులు పనిచేస్తున్నారు. అయితే వస్త్రోత్పత్తికి అవసరమైన యారన్(దారం) డిపోను వేములవాడలో ఏర్పాటు చేయడం చర్చనీయమైంది. సిరిసిల్ల పట్టణంలో ఉన్న జౌళిశాఖ ఆఫీస్‌ను ఇటీవల కలెక్టరేట్‌కు తరలించడం స్థానికంగా వివాదాస్పదంగా మారింది. వసతులు దరి చేరాల్సింది పోయి.. దూరమవుతున్నాయని స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జౌళిశాఖ ఉన్నతాధికారులు, పాలకులు సమాలోచనలు చేసి వసతులను కార్మికులు, ఆసాముల దరికి తేవాలని వారు కోరుతున్నారు.

### అందుబాటులో ఉంటే మంచిది



సిరిసిల్లలోనే జౌళిశాఖ ఆఫీస్, యారన్ డిపో ఉంటే అందరికీ అందుబాటులో ఉంటుంది. ఏ పని ఉన్నా కలెక్టరేట్ వరకు వెళ్లడం, వేములవాడ వరకు పోవడం ఇబ్బందిగానే ఉంది. ఇప్పటికైనా అధికారులు చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌ను బీవై నగర్‌లోని పాత భవనంలోకి మార్చితే బాగుంటుంది. అందరికీ అందుబాటులో ఉంటుంది.

– పోలు రాజయ్య, వస్త్రోత్పత్తిదారుడు, సిరిసిల్ల

### జౌళిశాఖ ఆఫీస్‌ను మార్చాలి



సిరిసిల్లలో దశాబ్ద కాలంగా ఉన్న చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌ను ఎందుకు కలెక్టరేట్‌కు మార్చారో అర్థం కాలేదు. కార్మికులకు, ఆసాములకు ఇక్కడ ఆఫీస్ ఉంటే అందుబాటులో ఉండేది. కలెక్టరేట్ వరకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకుని జౌళిశాఖ ఆఫీస్‌ను సిరిసిల్లకు మార్చాలి. లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమించాల్సి ఉంటుంది.

– మూషం రమేశ్, పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

### అన్నపూర్ణలో తగ్గిన నీటినిల్వలు



నీటినిల్వలు తగ్గిన అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు రిజర్వాయర్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులో నీటినిల్వలు భారీగా తగ్గిపోయాయి. ఎండలు తీవ్రంగా కొడుతుండడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 1.3 టీఎంసీల నీరు ఉన్నట్లు ప్రాజెక్టు డీఈ దేవేందర్ తెలిపారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా బుధవారం 2.74 టీఎంసీలు ఉన్న నీటి నిల్వలు ఆదివారం వరకు 1.3 టీఎంసీలకు చేరింది. బుధవారం నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టు ద్వారా 3,300 క్యూసెక్కుల నీటిని రంగనాయకసాగర్‌లోకి వదులుతున్నారు. అదేవిధంగా నిత్యం కాల్వల ద్వారా 80 క్యూసెక్కులు వెళ్తుందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతారం ప్రాజెక్టు మత్తడి ద్వారా మరోసారి నీటిని వదిలితే బిక్కవాగు ద్వారా నీరు ప్రవహించి పరివాహక ప్రాంతంలోని వ్యవసాయ, బోరుబావుల్లో నీటి నిల్వలు ఉంటాయని, పొట్టదశకు వచ్చిన పంట చేతికొస్తుందని రైతులు పేర్కొంటున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టులో 2.74 టీఎంసీల నీటి లభ్యత ఉంటేనే సర్ఫేస్ గేట్ల ద్వారా అనంతారం ప్రాజెక్టులోకి నీరుచేరి మత్తడిపడే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇల్లంతకుంట లో శనివారం ఇరిగేషన్ అధికారుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి నీటి సమస్యను స్థానిక రైతులు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి మరో టీఎంసీ నీటిని మిడ్‌మానేరు ద్వారా అన్నపూర్ణ ప్రాజెక్టులోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆరు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేస్తాం



వంతెన పనుల పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- రూ.6.85కోట్లతో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- మేలో రాజన్న ఆలయ విస్తరణ పనులు
- భీమన్నగుడిలో దర్శనాలకు ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: తిప్పాపూర్ ప్రధాన బస్టాండ్ నుంచి వేములవాడ పట్టణాన్ని అనుసంధానించే రెండో బ్రిడ్జి పనులు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రూ.6.85కోట్లతో నిర్మించే బ్రిడ్జి పనులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. విప్ మాట్లాడుతూ మర్రిపెల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, చందుర్తి మోత్కరావుపేట రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల వేములవాడలో రూ.700కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రూ.47కోట్లతో రోడ్డు విస్తరణ, రూ.35కోట్లతో నిత్యాన్నదానసత్రం, ఆలయ విస్తీర్ణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మే నెలలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖరశేఖరశర్మ వేములవాడకు రానున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి దర్శనాన్ని భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. రుద్రంగిలో ఏటీసీ కాలేజీ, మేడిపల్లి జూనియర్ కళాశాల మంజూరు చేశామన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయే వారికి తప్పకుండా నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రైల్వేలైన్లో భూమి పోతున్న వారికి కూడా న్యాయం చేస్తామన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బస్సు డిపో పక్కన నిలిచిన ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తామన్నారు. రూ.80లక్షలతో మార్కెట్ సముదాయం, వేములవాడలోని రెండో బైపాస్‌రోడ్‌లో రూ.80లక్షలతో కూరగాయల సముదాయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో రూ.10లక్షలతో వసతులు కల్పిస్తామన్నారు. కోనరావుపేట మండలంలో పెండింగ్ బ్రిడ్జీలు నిర్మిస్తామని తెలిపారు. మూలవాగులోని గంగమ్మ ఆలయానికి వెళ్లేందుకు ట్రాక్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

### అధికారులకు అభినందనలు

వేములవాడలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరైనట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేసిన వేములవాడ ఆర్డీవో, తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, నీటిపారుదల అధికారులను అభినందించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, డీఈ శాంతయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్ పాల్గొన్నారు.

– కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

# నిషా వదలట్లేదు !

- జిల్లాలో జోరుగా గంజాయి దందా
- పోలీసుల నిఘా ఉన్నా వీడని మత్తు
- కర్ణాటకలో సిరిసిల్ల కారు సీజ్

సిరిసిల్లక్రైం: జిల్లాను నిషా వదలట్లేదు. పోలీసులు ఎంత నిఘా పెట్టినా జిల్లాలోకి గంజాయి వచ్చి చేరుతోంది. ఇన్నాళ్లు మహారాష్ట్ర నుంచే వస్తుందనుకున్న గంజాయి కర్నాటక రాష్ట్రం నుంచి కూడా వస్తున్నట్లు ఇటీవల పరిణామాల ద్వారా తెలుస్తోంది. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు ఎన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా మత్తు మాత్రం వదలడం లేదు. జిల్లాలో యాంటీ డ్రగ్స్ క్లబ్స్, డీ ఆడిక్షన్ సెంటర్ ద్వారా మత్తు వదిలే కార్యక్రమాలు చేపడుతున్నా పూర్తిగా నిషేధం సాధ్యం కావడం లేదు. ఇటీవల కర్ణాటకలో జిల్లా వాసులు అరెస్ట్ సంచలనంగా మారింది.

**వందల్లో కేసులు.. క్వింటాళ్లలో గంజాయి**

రెండేళ్లలో వందల సంఖ్యలో గంజాయి కేసులు నమోదు కాగా క్వింటాళ్లలో పట్టుబడింది. అయినా జిల్లాలో గంజాయి వినియోగం విస్తృతంగా ఉన్నట్లు చర్చ సాగుతోంది.

**కర్ణాటకలో కారుతో కదులుతున్న డొంక**

కర్ణాటకలో గంజాయి రవాణా చేస్తూ సిరిసిల్లకు చెందిన వ్యక్తులు పట్టుబడడం సంచలనంగా మారింది. పట్టుబడ్డ రెండు వాహనాల్లో ఒకటి సిరిసిల్లకు చెందిన వ్యక్తిది కావడం గమనార్హం. ఓ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కారును స్థానికంగా స్వీట్‌హౌస్ నిర్వహించే వ్యక్తి కర్ణాటకకు తీసుకెళ్లినట్లు సమాచారం. గతేడాది నవంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లా పరిధిలో రెండు కార్లలో గంజాయిని తరలిస్తుండగా ముగ్గురిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి, 46కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఆ రాష్ట్ర పోలీసులు ఇటీవల సిరిసిల్లకు వచ్చి సదరు ప్రిన్సిపాల్‌ను విచారించినట్లు సమాచారం. అయితే ఇప్పటికీ సంబంధిత కారు విడుదల కాకపోవడంతో ప్రిన్సిపాల్‌కు, స్వీట్‌హౌస్ యజమానికి మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఈ గంజాయి కేసు విషయం వెలుగుచూసింది. స్వీట్‌హౌజ్ నిర్వాహకుడిపై ఫిర్యాదుకు ప్రభుత్వ ఉద్యోగి సిద్ధమవుతున్నట్లు సమాచారం. సిరిసిల్ల కేంద్రంగా అంతర్‌రాష్ట్ర గంజాయి దందా సాగుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి.



పట్టుబడిన గంజాయిని చూపుతున్న కర్ణాటక పోలీసులు, సీజ్ చేసిన సిరిసిల్లకు చెందిన కారు

**గంజాయి కేసులు.. పట్టుబడిన గంజాయి**

| సంవత్సరం | కేసులు | అరెస్ట్ | గంజాయి(కిలోలు) |
|---|---|---|---|
| 2022 | 16 | 51 | 04 |
| 2023 | 61 | 141 | 72 |
| 2024 | 211 | 211 | 42 |
| 2025 | 22 | 48 | 03 |

### మిడ్‌మానేరులో 14 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 14.04 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు నుంచి ఆదివారం ఎల్‌ఎండీకి 2500, కుడి కాలువకు 550, ప్యాకేజీ–9 మల్కపేటకు 210, ఎడమ కాలువకు 5, మిషన్‌భగీరథకు 45 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు.



### రైతుల వంటావార్పు

ఇల్లంతకుంట(మానకొండూర్): రిలే నిరాహార దీక్ష చేస్తున్న పెద్దలింగాపూర్ రైతులు ఆదివారం దీక్ష శిబిరం వద్ద వంటావార్పు చేపట్టారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు కాల్వను పూర్తి చేయాలని వీరు రిలే నిరాహారదీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి ఈసారైనా కాలువ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈనెల 12లోగా స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు హెచ్చరించారు.



### పెళ్లి వేడుకల్లో క్రికెట్ సందడి

సిరిసిల్ల: చాంపియన్ ట్రోఫీ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌పై క్రీడాభిమానులు ఆసక్తి కనబరిచారు. సిరిసిల్ల కే కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన ఓ పెళ్లి వేడుకల్లో భారీ స్క్రీన్‌పై క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రదర్శించారు. పెళ్లికి వచ్చి వధూవరులను ఆశీర్వదించిన బంధువులు భోజనాలు చేసి క్రికెట్ చూస్తూ గడిపారు. క్రికెట్‌పై అభిమానంతో పెళ్లి వేడుకల్లో ఆటను ప్రదర్శించడం విశేషం.



### ఈ రోడ్డుపై ఉయ్యాల.. జంపాల !

సిరిసిల్ల: చూడ్డానికి సెంట్రల్ లైటింగ్.. డివైడర్.. నునుపైన తారు రోడ్డు. అయితే దానిపై ప్రయాణిస్తేనే తెలుస్తుంది అసలు కథ. వేములవాడ నుంచి కమాన్‌సర్కిల్ మధ్య గల ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటే ఉయ్యాలా.. జంపాలా అన్నట్లుగా పైకి..కిందికి ఊపేస్తుంటుంది. చూస్తే పెద్దగా ఎగుడు..దిగుడుగా రోడ్డు కనిపించదు కానీ వాహనంలో కూర్చున్న ప్రయాణికులు మాత్రం పైకి..కిందికి ఊగుతుంటారు. రోడ్డు నిర్మాణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ సమస్య వచ్చినట్లు తెలిసింది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వారికి అసలు విషయం అర్థమవుతుంది. అప్పుడు ప్రయాణికుల ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

## క్లుప్తంగా

### ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న బియ్యం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో ఓ పాడుబడ్డ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం నిల్వ ఉందన్న సమాచారంతో ఎస్సై కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు జరుపగా సుమారు 8 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్‌లై అధికారులకు అప్పజెప్పారు. దాడుల విషయాన్ని గమనించిన బియ్యం నిల్వ చేసిన వ్యక్తి పారిపోయాడని, అతన్ని త్వరలోనే పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు.

### కాలువలో పడి యువకుడు మృతి


నరేశ్(ఫైల్)

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన గొర్రె నరేశ్ (30) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. నరేశ్ సెంట్రింగ్ పనిచేసేవాడు. ఇదే మండలంలోని కొండపల్కల గ్రామంలో అతడి బంధువు చనిపోగా, శనివారం ద్విచక్రవాహనంపై కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులతో ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో తన వెంట తెచ్చుకున్న తాళంచెవి మరిచి పోయాయని కుటుంబ సభ్యులను ఇంటి వద్ద దించి తిరిగి కొండపల్కల వైపు వెళ్తుండగా, మద్దికుంట శివారులోని కాలువ వద్ద బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొని కాలువలో పడిపోయింది. బండరాయిపై నరేశ్ పడిపోగా, బైక్ కూడా అతడి మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కాలువలో నుంచి తీసి కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో 108 వాహనంలో క్షతగాత్రుడిని ఎక్కించారు. 108 సిబ్బంది అతడిని పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### పూడిక తీస్తుండగా మట్టిపెల్లలు పడి కూలీ..


రాములు (ఫైల్)

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేటకు చెందిన గద్దెరాసి రాములు(44) బావిలో పూడికతీస్తున్న క్రమంలో మట్టిపెల్లలు పడి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఇదే మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లయ్య వ్యవసాయ బావిలో శనివారం పూడికతీత పనులు చేస్తున్న సమయంలో మట్టిపెల్లలు పడి రాములు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వేములవాడ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు బావి యజమాని మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

### అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య


సంపత్‌రెడ్డి(ఫైల్)

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు కొండం సంపత్‌రెడ్డి (45) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. పదినెలల క్రితం సంపత్‌రెడ్డి కొండగట్టు ఆంజనేయస్వామి జాతరకు వెళ్లగా జరిగిన ప్రమాదంలో ప్రమాదవశాత్తు ఎడమచేయి కోల్పోయాడు. అప్పుడు దాదాపు రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. ఎడమచేయి కోల్పోయినా బతుకుదెరువు కోసం పాన్ డబ్బా పెట్టుకుని జీవనం సాగించాడు. కాగా, ఈ ప్రమాదానికి ముందు రూ.4 లక్షల అప్పు చేసి కూతురు వివాహం చేశాడు. ఎంత కష్టపడినా అప్పులు తీర్చలేకపోవడం, ఏలాంటి ఆస్తులు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంపత్‌రెడ్డి ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

### కడుపునొప్పితో వివాహిత..


శిరీష(ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కరీంనగర్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్గునూరుకు చెందిన సిల్ల శిరీష(25) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా పరిస్థితి మెరుగుపడలేదు. ఆదివారం నొప్పి ఎక్కువ కావడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త ఆటో డ్రైవర్, ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ధర్మపురిలో ముస్తాబైన నృసింహుని ఆలయం
- ఈనెల 22 వరకు వివిధ కార్యక్రమాలు
- తొలి రోజు పుట్ట బంగారంతో ప్రారంభం


ముస్తాబైన నృసింహుని ఆలయం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. ఉత్సవాలకు ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. చలువపందిళ్లతో పాటు తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**13 రోజుల పాటు..**

ప్రాచీన పుణ్యక్షేత్రంగా వెల్లొందుచున్న ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నేటి నుంచి 22 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపిస్తారు. 13 రోజుల్లో వారం రోజులు అత్యంత కీలకమైనవి. సదరు రోజుల్లో నిత్యం 50 వేల నుంచి లక్ష వరకు భక్తులు వస్తుంటారని అధికారుల అంచనా వేశారు. సోమవారం పుట్ట బంగారంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. మంగళవారం సాయంత్రం నిర్వహించే స్వామివారల కల్యాణ వేడుకలకు సుమారు లక్ష వరకు భక్తులు వచ్చే అవకాశముంది. 14,15,16వ తేదీల్లో బ్రహ్మపుష్కరిణి కోనేరులో యోగ, ఉగ్ర, వేంకటేశ్వర్ స్వాముల తెప్పోత్సవం, డోలోత్సవం, 16,17,18వ తేదీల్లో స్వామివారల దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాలు చేపడతారు. 19న ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం స్వామివారల రథోత్సవం సాయంత్రం నిర్వహిస్తారు. 20,21,22వ తేదీల్లో ఉత్సవమూర్తుల ఏకంతోత్సవాలను వైభవంగా జరిపిస్తారు.

**వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు**

- ధర్మపురిలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు.
- వివిధ డిపోల నుంచి సుమారు 200 బస్సుల వరకు వేస్తున్నామని ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు.
- జగిత్యాల డిపో నుంచి 25 బస్సులు, నిర్మల్ డిపో నుంచి 15, ఆర్మూర్ డిపో 100, కరీంనగర్ 10, మంచిర్యాల తదితర డిపోలనుంచి సుమారు 50 బస్సులు నడిపించనున్నారు.
- అలాగే కరీంనగర్ నుంచి రాయపట్నం మీదుగా ధర్మపురికి 67 కిలో మీటర్లు, జగిత్యాల మీదుగా 80 కిలో మీటర్ల దూరం ఉంది.
- నిర్మల్ నుంచి జగిత్యాల మీదుగా 110 కి.మీ. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా 105 కి.మీ, నిజామాబాద్ నుంచి ధర్మపురి 130 కిలోమీటర్ల దూరం ఉంది.

### అన్ని ఏర్పాట్లు చేశాం

ధర్మపురి లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశాం. నీడ, నీరు, భోజన వసతులు కల్పిస్తున్నాం. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం.

– శ్రీనివాస్, ఆలయ ఈవో

## భక్తుల సౌకర్యం కోసమే కల్యాణ వేదిక మార్పు

- విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: భక్తుల సౌకర్యం కోసమే స్వామివారి కల్యాణ వేదిక మార్పు చేస్తున్నామని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆదివారం మాట్లాడారు. లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణ మహోత్సవం ఏటా ఆలయంలోని శేషప్ప కళావేదికపై నిర్వహించడంతో చాలా మంది భక్తులు తిలకించలేకపోయారని తెలిపారు. దీంతో భక్తులు, వేదపండితులు, దేవాదాయశాఖ అనుమతులు, సూచనల మేరకు మార్పు చేయడం జరుగుతుందని, బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీమఠం వద్ద సువిశాలమైన స్థలంలో స్వామివారి కల్యాణం జరిపించేందుకు దేవాదాయశాఖ అనుమతులు ఇచ్చారని వివరించారు. నూతన వేదిక వద్ద ఆగమశాస్త్రం ప్రకారం వేదపండితులు స్థల సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారని వెల్లడించారు. ప్రాణం ఉన్నంత వరకు దేవుని విషయంలో ఎలాంటి తప్పు చేయనని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధి, బ్రహ్మోత్సవాలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. శ్రీమఠం వేదిక చుట్టూ సొంత ఖర్చులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానని, రానున్న రోజుల్లో గోదావరి వరదలు రాకుండా కరకట్ట నిర్మాణం కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు ఎస్.దినేశ్, వేములు రాజు, చీపిరిశెట్టి రాజేశ్, సింహరాజు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# శివకల్యాణోత్సవానికి ఏర్పాట్లు


శివకల్యాణోత్సవానికి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న యాగశాల

- ఈనెల 16 నుంచి ఐదు రోజులు ఉత్సవాలు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 16 నుంచి 20 వరకు ఐదు రోజులపాటు రాజన్న బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రధానాలయం ముందు ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం శివకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని అర్చకులు చెబుతున్నారు. 12న కామదహనం, మూడు రోజులపాటు డోలోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. 17న (సోమవారం) ఉదయం పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారల కల్యాణం, 19న సాయంత్రం ఉత్సవ మూర్తుల రథోత్సవం, 20న అవబృత స్నానం, త్రిశూలయాత్ర, పూర్ణాహుతి, ఏకాదశవరణముల తో ఉత్సవాలు సమాప్తమవుతాయని తెలిపారు.

**విశేషమిది..**

రాష్ట్రంలోని మిగతా శైవ క్షేత్రాల్లో 'కారణాగమము' అనుసరించి మహాశివరాత్రి పర్విదినం రోజునే కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు జరుపుకుంటారు. కానీ వేములవాడలో మాత్రం «స్మార్త వైదిక» పద్ధతిని అనుసరించి మహాశివరాత్రి జాతర అనంతరం కామదహనం మరుసటి రోజున పార్వతీరాజరాజేశ్వరుల వివాహం జరుపుకుంటారని ఇక్కడి అర్చకులు తెలిపారు.

### తడారి.. మేతగా మారి..



కరీంనగర్‌రూరల్: సాగునీరందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. పొట్టదశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు బావుల్లో పూడిక తీయిస్తుండగా మరికొందరు కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. అయితే ఎలాంటి ఆధారం లేని రైతులు ఎండిపోతున్న పొలాలను గొర్రెలు, మేకలు, పశువులకు మేతగా విడిచిపెడుతున్నారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో బతుకమ్మ చెరువు కట్టకింద సాగు చేసిన పొలాలన్నీ నీళ్లలేక ఎండిపోతున్నాయి. రైతులు దుర్గం మల్లేశ్‌కు చెందిన 20 గుంటలు, దాడి ఓదెలు 10గుంటల వరిపొలమంతా ఎండిపోవడంతో ఆదివారం గొర్రెల మేతకు విడిచిపెట్టారు.

# అరుదైన ఆవులు.. మేలుజాతి గేదెలు

- శాలరామన్నపల్లెలో అరుదైన ఆవులను సంరక్షిస్తున్న రాజిరెడ్డి


సాహివాల్ ఆవులతో రాజిరెడ్డి


శాలరామన్నపల్లెలో గేదెల షెడ్డు

సిరిసిల్ల: పాడిపరిశ్రమను వృత్తిగా స్వీకరించి చాలా మంది ఉపాధి పొందుతున్నారు. కానీ, వేములవాడ అర్బన్ మండలం శాలరామన్నపల్లెకు చెందిన సోర్పు రాజిరెడ్డి అరుదైన ఆవులను కొనుగోలు చేసి సంరక్షిస్తున్నారు. పాకిస్తాన్‌కు చెందిన కాంగాయాన్ (కాంక్రీవాల్), సాహివాల్, ఒంగోలు గిర్, హర్యానా ఆవుల రకాలను కొనుగోలు చేసి పోషిస్తున్నారు. ఈ మూడు వెరైటీ ఆవులు ఒక్కొక్కటి రోజుకు సగటున పది లీటర్ల పాలు ఇస్తున్నాయి. పాకిస్తాన్ వెరైటీ కాంగాయాన్‌ను రూ.2లక్షలకు కొనుగోలు చేశారు. ఆధునిక బర్రెల షెడ్డు, ఐదెకరాల్లో గడ్డిజాతుల పెంపకం, గడ్డిని ముక్కలు చేసే ఛాప్‌కట్టర్ యంత్రం ఇలా ఆధునికంగా బర్రెల, ఆవుల షెడ్డును నిర్వహిస్తున్నారు. రాజిరెడ్డి షెడ్డులో 30 మేలురకమైన బర్రెలు, ఐదు వెరైటీ ఆవులు ఉన్నాయి. వీటి సంరక్షణకు బిహార్‌కు చెందిన రెండు జంటలు పని చేస్తున్నారు. నిత్యం 300 లీటర్ల పాలను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతా భవన్‌కు సరఫరా చేస్తున్నారు. అరుదైన ఆవులు, మేలురకమైన బర్రెలు, ఆధునిక షెడ్డులో రాజిరెడ్డి పాడిపరిశ్రమను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే మరిన్ని అరుదైన ఆవులను సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాజిరెడ్డి తెలిపారు. చేసే పనిపై ఆసక్తి, అభిరుచి ఉంటే.. వైవిధ్యంగా ముందుకు సాగవచ్చని నిరూపిస్తున్నారు.





### తరలివచ్చి.. తరించి

వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వరుస సెలవులు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి స్వామివారి సేవలో తరించారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే పునర్వసు నక్షత్రోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయంలోని సీతారామచంద్రస్వామి వారికి ఆలయ అర్చకులు పంచోపనిషత్ ద్వారాభిషేకం చేశారు. పరివార దేవాతార్చనలు, సదస్యం నిర్వహించారు.

## ఫోన్ ఎత్తుకెళ్లి రూ.1.40 లక్షలు ట్రాన్స్‌ఫర్

జమ్మికుంట(హుజూరాబాద్): పరిచయం పెంచుకొని ఫోన్ ఎత్తుకెళ్లి అకౌంట్ నుంచి రూ.ఒక లక్ష 40 వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకొని మోసం చేసిన ఘటన జమ్మికుంటలో జరిగింది. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు.. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన మీర్జాన్ ఇమ్రాన్ బేగ్ పారడైజ్ బిర్యాని సెంటర్ నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్‌బాష (ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం) అప్పుడప్పుడు బిర్యాని సెంటర్‌కు వస్తూ పరిచయం చేసుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఇంట్లోవారికి ఫోన్ చేసి ఇస్తానని మీర్జాన్ ఇమ్రాన్ బేగ్ నుంచి మహమ్మద్ ఇమ్రాన్ బాష ఫోన్ తీసుకొని పరారయ్యాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ రూ.ఒక లక్షా 40 వేలు అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

# మక్కకు మద్దతు కరువు

- మొన్నటి వరకు క్వింటాల్‌కు రూ.2,800 – రూ.3,000 పలికిన ధర
- ప్రస్తుతం రూ.2,100– రూ.2,200 పలుకుతున్న వైనం



జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న. యాసంగి సీజన్‌లో ఓ వైపు అడవి పందులు, మరో వైపు రామచిలుకలు, ఇంకో వైపు కోతులతో రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తుంది. మార్కెట్‌లో వ్యాపారులు పెట్టే ధరలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే, ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు మొక్కజొన్నను కొనుగోలు చేపట్టే ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

**35 వేల ఎకరాల్లో సాగు**

జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్‌లో 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ మేరకు 7–8 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. వానాకాలంలో రైతులు ఇబ్బడిముబ్బడిగా వరి సాగు చేసినప్పటికీ తెగుళ్లతో అనుకున్న స్థాయిలో దిగుబడులు రాలేదు. దీనికి తోడు పంట మార్పిడి చేయాలనే ఉద్దేశంతో చాలా మంది రైతులు వరి స్థానంలో మొక్కజొన్న సాగు చేశారు. దీంతో, మొక్కజొన్న సాగు విస్తీర్ణం జిల్లాలో గతేడాదితో పోల్చితే దాదాపు 15 వేల ఎకరాల వరకు ఎక్కువగా సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈసారి మక్కకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటంతో ఎకరాకు సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు తీశారు.

**వానాకాలంలో రూ.2,800.. ఇప్పుడు రూ.2,100**

మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225. అయితే, మొన్నటి వరకు ప్రభుత్వ మద్దతు ధరను మించి క్వింటాల్‌కు రూ.2,800–3000 వరకు ధర పలికింది. ఇప్పుడు రైతుల చేతుల్లోకి మొక్కజొన్న రాగానే, ధర అమాంతం రూ.2,100–2,200 చేరుకుంది. పూర్తి స్థాయిలో మొక్కజొన్న మార్కెట్‌కు వస్తే వ్యాపారులు రేటు మరింత తగ్గించే అవకాశాలు ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, అటు వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తల పట్టుకుంటున్నారు.

**వ్యాపారులు చెప్పిందే రేటు**

మొక్కజొన్నను బిస్కెట్ పరిశ్రమ, కోళ్ల దాణాగా.. పలు రకాలుగా ఉపయోగిస్తుండటంతో డిమాండ్ ఉంది. అయితే, ఇక్కడి కంటే తక్కువ రేటుకే ఇతర రాష్ట్రాల నుంచి వస్తుందంటూ దళారులు రేటు తగ్గిస్తున్నారు. కాగా, ఎకరా మొక్కజొన్న సాగుకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెడుతుంటారు. పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి, రైతుల్లోని అనైక్యతను ఆసరాగా చేసుకుని ఇష్టం వచ్చిన రేటు పెడుతుండటంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. రైతుల నుంచి మక్క కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ సంస్థ రంగంలోకి దిగితే కనీసం వ్యాపారస్తులు ఆ రేటు వరకైనా గ్రామాల్లో కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుంది.

### ప్రభుత్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. మొక్కజొన్న మార్కెట్‌కు వస్తుండగానే రేటును భారీగా తగ్గిస్తున్నారు. ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారస్తులు తక్కువ రేటు పెడుతున్నారు.

– మిట్టపెల్లి లచ్చిరెడ్డి, ఇటిక్యాల, రాయికల్

### మరింత తక్కువ రేటు..



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే వ్యాపారులు మరింత తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాలు లేకపోతే వ్యాపారస్తులది ఆడింది ఆట పాడింది పాటగా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే అవకాశం ఉంది.

– ఎల్లాల శేఖర్‌రెడ్డి, ఇటిక్యాల, రాయికల్

### కోనరావుపేటలో కుక్కల వీరంగం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని కోనరావుపేటలో వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. శనివారం సాయంత్రం గ్రామంలో పలువురిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో ఐదుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. గాయపడ్డ వారంతా కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. కాగా వారం రోజుల వ్యవధిలోనే పది మంది వరకు వీధి కుక్కల దాడిలో గాయపడ్డట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

### ఇన్సూరెన్స్ కోసం వ్యాన్ తగలబెట్టిన యజమానిపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో శనివారం రాత్రి నిలిచి ఉన్న వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి పూర్తిగా దగ్ధం అయిన విషయం తెలిసిందే. కాగా ఇది ప్రమాదవశాత్తు జరగలేదని, ఇన్సూరెన్స్ డబ్బులు రాబట్టేందుకు వ్యాన్ యజమాని వేసిన పక్కా స్కెచ్ అని పోలీసులు తెలిపారు. ఆదివారం ఎస్సై రామ్మోహన్ వివరాలు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన నిమ్మల మహేశ్ 9 నెలల క్రితం ఫైనాన్స్ ద్వారా డీసీఎం వ్యాన్ కొనుగోలు చేశాడు. అయితే తరుచూ రిపేర్‌కు రావడంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. వ్యాన్‌ను కాల్చేసి ఇన్సూరెన్స్ డబ్బులు పొందాలనే పక్కా ప్రణాళికతో ఇటీవల ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. ప్లాన్ ప్రకారం శనివారం రాత్రి పెట్రోల్ బంకులో పెట్రోల్ తీసుకువచ్చి వ్యాన్ క్యాబిన్‌లో చల్చి నిప్పు అంటించాడు. గ్రామపంచాయతీ కారోబార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ విషయాలు వెల్లడైనట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.